సాక్షి
నంద్యాల
సోమవారం ; 26 ; జూన్ ; 2023



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధనలో భాగంగా శ్రీశైలంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ నరసింహస్వామి అకాడమీ కళాకారుల సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.



భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది మంది తరలివచ్చారు. కోనేరులలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.



తీరనున్న వసతి కష్టాలు

మంత్రాలయంలో వసతి గదుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఆరాధనోత్సవాలకు నూతన గదులను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో శ్రీమఠం అధికారులు ఉన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

జూలై నెల ఆర్జితసేవల టికెట్లు విడుదల

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లో జరిగే అన్ని ఆర్జితసేవలు, స్వామివారి స్పర్శదర్శనం ఆన్‌లైన్ టికెట్లు జూలై నెలకు సంబంధించిన కోటాను దేవస్థాన అధికారులు ఆదివారం విడుదల చేశారు. శ్రీశైల దేవస్థాన వెబ్‌సైట్ www. srisailadevasthanam.org ద్వారా టికెట్లు పొందవచ్చు. స్వామిఅమ్మవార్లను దర్శించుకునే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వేముల మహేష్ దంపతులు ఆదివారం రూ.1,00,005 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు దేవికకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులందరికీ త్వరితగతిన సౌకర్యవంతమైన స్వామివారి దర్శనాన్ని దేవస్థాన అధికారులు కల్పిస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రధాన వీధులన్నీ కళకళలాడాయి.



నంద్యాల పట్టణం ఏరియల్ వ్యూ..

పట్టణం పల్లెవించగా..

- పట్టణాల్లో ఏటా భారీగా పెరుగుతున్న జనాభా
- సమీప గ్రామాల నుంచి వచ్చి స్థిరపడుతున్న వైనం
- పిల్లల చదువు, ఉద్యోగాలు, ఉపాధి కోసం పట్టణ బాట

గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రావడం.. అదే క్రమంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం.. వ్యాపార అవకాశాలు విస్తృతంగా ఉండటంతో పల్లె జనం పట్టణాలకు చేరుతున్నారు. రెండు దశాబ్దాల్లో జిల్లాలోని పలు పట్టణాల్లో జనాభా పెరుగుదలనే ఇందుకు నిదర్శనం. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తుండటం, కొందరు వ్యాపారాలు నిర్వహిస్తుండటం, మరి కొందరు ఉపాధి నిమిత్తం పట్టణ బాట పడుతున్నారు. దీంతో చిన్న చిన్న పట్టణాలు అనతి కాలంలోనే వేగంగా విస్తరిస్తున్నాయి.

– నంద్యాల

పల్లె జనం పట్టణ బాట పడుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, పిల్లల చదువు కోసం పట్టణాలకు చేరుకుంటున్నారు. గత 20 ఏళ్లలో పట్టణ జనాభా మూడింతలు పెరిగింది. ఇదే క్రమంలో పట్టణ సమీపంలో ఉన్న పల్లెలు పట్టణాల్లో విలీనమవుతున్నాయి. క్రమేణా పల్లె వాతావరణం మాయమై పట్టణీకరణలో మార్పు కనిపిస్తోంది. జిల్లా కేంద్రం నంద్యాలతో పాటు డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె, పాణ్యం పట్టణాల్లో జనాభా పెరుగుతోంది. దాదాపు 22 ఏళ్ల క్రితం ఈ పట్టణాల మొత్తం జనాభా 3,44,124 మంది ఉండగా 2011 సంవత్సరానికి 4,28,461 మందికి చేరినట్లు గణాంక అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో 2021 సంవత్సరంలో జనాభా లెక్కల సేకరణ చేయాల్సి ఉండగా కరోనా వల్ల సాధ్యం కాలేదు. అయితే 2011 జనాభాతో పోలిస్తే 2021 సంవత్సరానికి రెట్టింపు అయినట్లు గణాంక అధికారులు చెబుతున్నారు. ప్రతి పల్లెల్లో విద్యావకాశాలు మెరుగు పడటంతో పదో తరగతి తర్వాత కళాశాలల్లో పిల్లలను చదివించేందుకు పలువురు పట్టణాలకు చేరుతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులు కనుమరుగు కావడంతో ఉపాధి కోసం పల్లెను తప్పక వీడుతున్నారు. ఇదే క్రమంలో పట్టణాల్లో పలు ఉద్యోగాలు చేస్తున్న వారు రోజూ రాకపోకలు సాగించలేక పట్టణాల్లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో పట్టణ జనాభా పెరుగుతోంది. జనాభా పెరుగుతుండటంతో అదే దిశలో శివారు కాలనీలు కూడా వెలుస్తున్నాయి. దీంతో పట్టణ సమీపంలోని పల్లెలు పట్టణాల్లో కలిసిపోతున్నాయి. దీంతో మేజర్ గ్రామ పంచాయతీలు చిన్న చిన్న పట్టణాలుగా, చిన్న పట్టణాలు పెద్ద పట్టణాలుగా మారుతున్నాయి. నంద్యాల పట్టణంలో ఊడుమాల్పురం, పొన్నాపురం, రైతునగరం, వెంకటేశ్వరపురం, క్రాంతినగర్‌లు ఇప్పటికే కలిసిపోయాయి. అయ్యలూరు, చాబోలు, చాపిరేవుల, కానాల, కొత్తపల్లె గ్రామాల సమీపం వరకు ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ గ్రామాలు సైతం నంద్యాల పట్టణంలో కలిసిపోనున్నాయి. ఈ గ్రామాలు కూడా నంద్యాలలో కలవడానికి ఐదేళ్లకు మించి సమయం పట్టే అవకాశం లేదు. జనాభాను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం నంద్యాల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలుగా విభజించింది.

జిల్లాలోని పట్టణాల్లో జనాభా పెరుగుదల ఇలా

పట్టణం	2001లో..	2011లో..
నంద్యాల	1,52,676	2,11,424
బనగానపల్లె	16,462	20,749
ఆత్మకూరు	39,794	45,703
ఆళ్లగడ్డ	26,375	29,798
నందికొట్కూరు	40,210	46,953
పాణ్యం	12,157	14,562
డోన్	56,450	59,272
మొత్తం	3,44,124	4,28,461

నంద్యాల మండలం రెండుగా..

రోజురోజుకు పెరుగుతున్న పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకుని పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల మండలాన్ని రెండుగా విభజించింది. నంద్యాల మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2,69,368 మంది జనాభా ఉండగా, ప్రస్తుతం ఇందుకు రెట్టింపు జనాభా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పట్టణంలో జనాభా పెరుగుతుండడంతో ప్రజల సౌలభ్యం కోసం రెండు మండలాలుగా విడదీసి రెండు తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. నంద్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో, నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన రెవెన్యూ భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రెండు కార్యాలయాలకు సంబంధించి అధికారులను పూర్తి స్థాయిలో నియమించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 29 మండలాలు ఉండగా నంద్యాల మండలం రెండుగా అవ్వడంతో మండలాల సంఖ్య 30కి చేరుతుంది. దీంతో నంద్యాల స్వరూపమే మారనుంది.



నంద్యాల మున్సిపాలిటీలో కలిసిన రైతునగరం పంచాయతీ

మౌలిక సదుపాయాలపై దృష్టి..

పట్టణాల్లో జనాభా పెరుగుదల నేపథ్యంలో ప్రధానంగా విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు, పెద్ద పెద్ద మాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లు ఏర్పాటవుతున్నాయి. దీంతో మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. పట్టణాలకు చేరుతున్న జనాభాకు అనుగుణంగా సమీప గ్రామాలు పట్టణాల్లో కలుస్తుండటంతో అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కొత్త కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సదుపాయం, వంటి సౌకర్యాలు అధికారులు కల్పిస్తున్నారు. రహదారుల అనుసంధానం చేయడం, వంతెనలు నిర్మిస్తున్నారు. అలాగే పట్టణాల మధ్య రైల్వే సౌకర్యం మెరుగుపడింది.

పిల్లల చదువు కోసం వచ్చా



నాకు గ్రామంలో ఐదు ఎకరాల పొలం ఉంది. నా పిల్లలను చదివించుకోవడానికి ఐదు సంవత్సరాల క్రితం నంద్యాలకు రావాల్సి వచ్చింది. మా గ్రామం నుంచి నంద్యాలకు వచ్చిపోవడానికి వీలుకాకపోవడంతో నంద్యాలలోనే ఇల్లు కొనుగోలు చేసి ఇక్కడే స్థిరపడ్డాం. ఊళ్లో ఉన్న పొలం కౌలుకు ఇస్తున్నాను. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నా.

-రామిరెడ్డి, గుండుపాపల, దొర్నిపాడు (మం)

ఆటో నడుపుతున్నా..



గ్రామంలో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గ్రామాల్లో చాలా మంది బైక్‌లు, కార్లు కొనుగోలు చేయడంతో ఆటోకు గిరాకీ లేక జీవనం కష్టంగా ఉండేది. దీంతో బతుకుదెరువు కోసం నంద్యాలకు వచ్చాను. ప్రస్తుతం ఇక్కడే ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. పిల్లలను మంచి స్కూల్‌లో చేర్పించాను.

– మిడుతూరు రాజు, ఆటోడ్రైవర్, దబ్ల్యూ.గోవిందిన్నె

శివారు కాలనీల్లో అభివృద్ధి పనులు



నంద్యాల శివారులో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. అలాగే ఇటీవలే పొన్నాపురం, ఊడుమాల్పురం, వెంకటేశ్వరపురం, రైతునగరం పంచాయతీలు నంద్యాల మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. మున్సిపాలిటీలో కలిసిన పంచాయతీ, కొత్త కాలనీలో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

రౌడీషీటర్లపై నిఘా పెంచండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సూచించారు. కర్నూలు బి.క్యాంప్‌లోని రేంజ్ కార్యాలయం నుంచి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల నుంచి ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, డీసీఆర్‌బీ సీఐ జయరాములు, ఎస్‌ఐ సూర్యమౌళి ఇతర పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ.. రౌడీషీటర్స్‌పై నిఘా ఉంచడం ద్వారా నేరాలు జరగకుండా చూడాలన్నారు. నిందితులకు కోర్టులో శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యే నిందితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతోపాటు విద్యాసంస్థలు ఉండే ప్రాంతాల్లో తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. గంజాయి విక్రయిస్తున్న నిందితులను గుర్తించి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రవర్తించేవారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయాలని, రౌడీషీట్ ఓపెన్ చేయాలని తెలిపారు.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో సోమవారం నుంచి జరిగే పది, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నంద్యాల పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. థియరీ పరీక్షలు జూన్ 26 నుంచి జూలై 4వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు జూలై 5 నుంచి 7వ తేదీ వరకు ఒక్క పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పది పరీక్షలకు 669 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 949 మంది, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 48 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి 15 నిమిషాలు ముందుగానే చేరుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగులకు నేడు అంతర్ జిల్లా బదిలీలు

కర్నూలు(అర్బన్): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఉద్యోగుల అంతర్ జిల్లా బదిలీలను సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి చేపట్టనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదివారం తెలిపారు. విలేజ్ సర్వేయర్, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్, వార్డు అడ్మిన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ, వార్డు అమినిటీస్ ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విలేజ్ సర్వేయర్లకు ల్యాండ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు డీఆర్వో కార్యాలయంలో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన కౌన్సెలింగ్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు.

నేటి నుంచి పూర్తిస్థాయిలో పాఠశాలలు

కర్నూలు (సిటీ): వాతావరణ పరిస్థితులు సాధారణ స్థాయికి చేరడంతో పాఠశాలలు సోమవారం నుంచి పూర్తిస్థాయిలో రెండు పూటల పనిచేస్తాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 12 నుంచి 24 వరకు ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువ ఉండటంతో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎండల తీవ్రత తగ్గి.. వర్షాలు పడుతుండటంతో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో పనిచేస్తాయని డీఈఓ రంగారెడ్డి తెలిపారు.

రెప్పపాటులో ఘోరం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి
- పందులను పట్టుకునేందుకు వెళ్తుండగా దుర్ఘటన



మృతులు ముత్తయ్య, మల్లయ్య, వీరేష్ (ఫైల్)

హొళగుంద/కోడుమూరు రూరల్: వారంతా వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. రైతుల పొలాల్లో పంటలను అడవి పందులను నాశనం చేస్తున్నాయని, వాటిని పట్టుకునేందుకు వాహనంలో వెళ్తున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రెప్పపాటులో ఘోరం జరిగిపోయింది. కూలీలు ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో 13 మందికి తీవ్రగాయాలయ్యాయి. కోడుమూరు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదం హొళగుంద మండలం హెబ్బటం, కొత్తపేట, ఆలూరు మండలం కురుకుంద గ్రామాల్లో విషాదాన్ని నింపింది. ఆ గ్రామాలకు చెందిన ముగ్గురు మృత్యువాత పడగా పలువురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. కొత్తపేటకు చెందిన వ్యవసాయ కూలీలతో పాటు హెబ్బటం, ఆలూరు మండలం కురుకుందకు చెందిన మొత్తం 16 మంది కలిసి రైతుల పొలాల్లో పంటలను నాశనం చేస్తున్న అడవి పందులను పట్టుకునేందుకు తెలంగాణ ప్రాంతాలకు బొలేరో ట్రాలీ వాహనంలో వెళ్లారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని కోడుమూరు దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్ద లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న హొళగుంద మండలం హెబ్బటానికి చెందిన బోయ బలదూరు మల్లయ్య(32), కొత్తపేటకు చెందిన బోయ ముత్తయ్య(34) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన 13 మందిని పోలీసులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆలూరు మండలం కురుకుందకు చెందిన వీరేశ్ (35) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కొత్తపేటకు చెందిన ముత్తయ్యకు భార్య, ఐగురు ఆడపిల్లలు, కూమారుడు ఉన్నాడు. హెబ్బటం మల్లయ్యకు భార్య గంగమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు గ్రామాలకు చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

మద్యం మత్తే కారణం..

లారీ డ్రైవర్ నరసప్ప మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నరసప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నాణ్యతకు ప్రాధాన్యం.. రైతుకు ధైర్యం

- పకడ్బందీగా విత్తనాలు, పురుగుమందు పరీక్షలు
- నంద్యాల అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో రికార్డు స్థాయి పరీక్షలు
- జూన్ నెలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం



ప్రయోగశాలలో పరీక్షల ఫలితాల్ని నమోదు చేస్తున్న దృశ్యం

నంద్యాల (సెంట్రల్): ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోందంటే చాలు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు నాసిరకం విత్తనాలు, ఎరువుల్ని అంటగట్టేందుకు మాటు వేస్తారు. ఇలాంటి నకిలీలను అడ్డుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చినవే వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు. వీటితో పైసా ఖర్చు లేకుండా ఇన్‌పుట్స్‌ను ముందుగానే పరీక్షించుకోవటం ద్వారా నాసిరకం బారిన పడకుండా ధైర్యంగా వ్యవసాయం చేసేందుకు రైతన్నలకు భరోసా లభించింది. ఇన్నాళ్లూ సాగు పరీక్షలంటే జిల్లా కేంద్రం వైపు చూసే పరిస్థితి నుంచి నియోజకవర్గ కేంద్రాలకే సేవల్ని అందుబాటులోకి తేవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గ కేంద్రాలకు వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు మంజూరయ్యాయి. ప్రస్తుతం నంద్యాల, ఆళ్లగడ్డలో ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. నంద్యాల అగ్రి టెస్టింగ్ ప్రయోగశాలలో ఎరువులు, పురుగుమందులపై నాలుగు రకాలుగా వర్గీకరించి పరీక్షలు చేస్తున్నారు. వీటిలో యాక్ట్ శాంపిల్స్, ఆర్‌బీకేల నుంచి వచ్చే నమూనాలు, రైతులు నేరుగా వచ్చి చేయించుకునే పరీక్షలు, దుకాణాల నుంచి అధికారులు తనిఖీల కోసం సేకరించే వాటిపై నాణ్యత నిర్ధారణ చేసి ఫలితాలు అందిస్తున్నారు. ఫలితాల్లో కచ్చితత్వం ఉంటుండటం, రైతుల మన్ననలు పొందటంతో ఏటా పరీక్షల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సొంతంగా తయారు చేసిన విత్తనమైనా, మార్కెట్‌లో కొనుగోలు చేసినవైనా నేరుగా ల్యాబ్‌కు వెళ్లి పూర్తి ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చు. కేవలం ఉచిత పరీక్షలకే పరిమితం కాకుండా వ్యాపారులు, డీలర్లు, తయారీదారులు, ఇతరులు నాణ్యతా ప్రమాణాల పరీక్ష నివేదిక కోసం ఎరువుల రకాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు రుసుం తీసుకుని ఫలితాలు ఇస్తున్నారు. దీంతో 2023–24లో ఇప్పటి వరకు రూ.1,02,300 ఆదాయం ప్రయోగశాలకు సమకూరింది. యాక్ట్ నమూనాల్ని రాష్ట్రంలోని నాలుగు డీకోడింగ్ సెంటర్లైన తిరుపతి, అమరావతి, వైజాగ్‌లకు పంపి జంబ్లింగ్ విధానంలో నమోదు చేస్తుండటంతో ఫలితాల్ని తారుమారు చేయటానికి ఆస్కారం లేకుండా చేసి కచ్చితత్వం, పారదర్శకతలకు పెద్దపీట వేశారు.

ఆటోమేషన్ విధానంతో పారదర్శకత..

నమూనా పరీక్షల కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌సైట్)ను అభివృద్ధి చేశారు. ఫలితాలను ట్యాంపర్ (తారుమారు) చేసేందుకు వీల్లేని రీతిలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. పరీక్షించిన ప్రతి నమూనా రికార్డు కావటంతో పాటు ఫలితాలు ఆటోమేటిక్‌గా అంతర్జాలంలో నమోదవుతాయి. ఏ సమయంలో ఏ శాంపిల్‌ను పరీక్షించారో నిర్ధారిస్తూ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా ఈ టెక్నాలజీ నమోదు చేస్తుంది. రైతు షాపుకు వెళ్లినప్పుడు బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుంటే చాలు నాణ్యతా ధ్రువపత్రం ఉందో లేదో తెలిసిపోతుంది. దీంతో పాటు గ్రో అవుట్ టెస్టింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఇక్కడ మొక్కల జనరిక్ ప్యూరిటీ పరీక్ష కూడా చేస్తారు. ప్రయోగశాలలో పనిచేసే ఏవోలు, ఏఈవోలు, ఏడీలకు జాతీయ సంస్థల ద్వారా అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. సమీకృత ల్యాబ్‌ను సమీప రైతు భరోసా కేంద్రాలతో అనుసంధానించారు. ఇన్‌పుట్స్ పరీక్షించుకుందుకు అన్నదాతల్ని ప్రోత్సహించేలా ఆర్బీకే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ సైతం ఇచ్చారు. ఒక్కో ఆర్బీకేకు ఐదు పురుగుమందుల, ఐదు విత్తన పరీక్షల కోసం నమూనా లక్ష్యాల్ని నిర్దేశించారు. దీంతో విస్తృతంగా నాణ్యతా నిర్ధారణలు చేస్తూ రైతులకు మేలు చేకూరుస్తున్నారు.



నంద్యాలలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్

నంద్యాల ల్యాబ్‌కు ప్రథమ స్థానం

- ఎరువులు, విత్తన పరీక్షలకు సంబంధించి వ్యవసాయశాఖ నెలవారీగా ప్రకటించే ర్యాంకుల్లో జూన్ నెలకు 341 పరీక్షలతో రాష్ట్రంలో ట్రేడ్ నమూనా నిర్ధారణల్లో నంద్యాల అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మొదటి స్థానంలో నిలిచింది.
- 2023–24 సంవత్సరంలో ఈ మూణ్నెళ్ల కాలానికే 425 నమూనాల్లో 395 శాంపిళ్ల ఫలితాలు విశ్లేషించారు. 30 విశ్లేషణా ప్రక్రియలో ఉన్నాయి.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 68 నమూనాలు రాగా, వీటిలో 67 విశ్లేషించి ఫలితాలు అందించారు. వీటిలో బోరాన్ అందుబాటులో లేక ఒకదానిని తిరస్కరించగా, ఐదింటిలో లోపాలు గుర్తించి రైతులకు తెలియజేశారు. 2022–23 ఏడాదిలో 559 నమూనాల్ని పరీక్షించి ఐదు విత్తన శాంపిళ్లలో లోపాల్ని గుర్తించారు.



ల్యాబ్‌లో ఆధునిక పరికరాలు

విత్తన పరీక్ష తర్వాతనే నారు పోస్తాను



కేసీ కాలువ కింద నాకు 3 ఎకరాల పొలం ఉంది. ప్రతి ఏడాది సోనా మసూరి వరిని సాగు చేస్తుంటాను. గతంలో మార్కెట్లో కొన్న విత్తనం ఎలా ఉన్నా నారు పోసుకోవాల్సి వచ్చేది. అదృష్టం బాగుంటే మొలకెత్తేవి లేదంటే లేదు అన్నట్లు ఉండేది. కానీ గత రెండు సంవత్సరాలుగా పైసా ఖర్చు లేకుండా అగ్రిల్యాబ్‌లో పరీక్షించుకున్న తర్వాతే నారు పోస్తున్నాను. నాణ్యత బాగుందని రిపోర్టు వచ్చిన తర్వాతనే సాగు చేస్తాను.

– పంజుగుల గోపీనాథ్‌రెడ్డి, రైతు, జిల్లెల్ల, నంద్యాల మండలం

ధైర్యంగా సాగు చేయవచ్చు



అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత మార్కెట్లో నకిలీ, నాసిరకాల ఉత్పత్తులకు చాలావరకు అడ్డుకట్ట పడింది. కంపెనీలు, అమ్మకందారుల్లో జవాబుదారీతనంతో పాటు రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్స్ అందుబాటులోకి తెస్తున్నాం. జూన్ నెల ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే మొదటిస్థానంతో పరీక్షల విషయంలో సిబ్బంది కార్యదక్షత రుజువైంది. త్వరలోనే భూసార పరీక్షల్ని సైతం ఇక్కణ్నుంచే నిర్వహించాలని ప్రయత్నాలు చేస్తున్నాం.

– రాజశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల సబ్‌డివిజన్

క్లుప్తంగా

అప్పుల బాధతో బలవన్మరణం


జి . విజయ్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: అప్పుల బాధతో మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన జి. విజయ్ (32) ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులు ఎక్కువ కావడంతో కొన్ని రోజుల క్రితం బతుకు తెరువు నిమిత్తం ఆదోనికి వచ్చి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధతో మనస్తాపం చెంది ఆదివారం ఆదోని–ఇస్వి మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విజయ్ మృతి చెందడంతో భార్య పిల్లలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ఎం. రామస్వామి తెలిపారు.

విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం


మాట్లాడుతున్న ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని విద్యుత్ అధికారులను దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం, గాలి, ఇతర సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తితే వెంటనే స్పందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరం చూపాలని ఆదేశించారు.

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం టొంగు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా నంద్యాల నుంచి కర్ణాటకు వెళ్తున్న లారీని తనిఖీ చేయగా 250 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ మేరకు లారీ, బియ్యం సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పట్టుకున్న రేషన్‌బియ్యాన్ని సివిల్ సప్లై శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

ఆదోని అర్బన్ : కారు ఢీకొనడంతో పెద్దతుంబళం గ్రామానికి చెందిన భోంపల్లి నరసింహులు(48) అనే వ్యక్తి మృతి చెందాడు. పెద్దతుంబళం ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. భోంపల్లి నరసింహులు పొలంలో కుమారుడు వీరేష్‌కు భోజనం క్యారియర్ ఇచ్చి ఇంటికి తిరిగొస్తుండగా పెద్దతుంబళం సమీపంలో మంత్రాలయం నుంచి వస్తున్న కర్ణాటకకు చెందిన కారు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాబోయ్..దొంగలు!


- జిల్లాలో మళ్లీ వరుస చోరీలు
- పొరుగు జిల్లాల నుంచి వస్తున్న ముఠాలు
- రెండు నెలల వ్యవధిలో రూ.అరకోటి పైనే సొమ్ము అపహరణ
- చోరీలను అరికట్టడంలో పోలీసులు విఫలం

జిల్లాలో దొంగలు మళ్లీ చెలరేగుతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. రెండు నెలల వ్యవధిలో సుమారు రూ.అరకోటికి పైగా ప్రజల సొమ్మును లూటీ చేశారు. ఇటీవల చైన్ స్నాచర్లు కూడా చేతివాటం ప్రదర్శిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రమైన కర్నూలులో ఐదు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో నెలకు కనీసం 10 నుంచి 15 దొంగతనం కేసులు నమోదవుతున్నాయి. కష్టపడి సంపాదించుకున్నదంతా పోగొట్టుకుంటున్న బాధితులు లబోదిబోమంటున్నారు.

– కర్నూలు


మారుతీ మెగా సిటీలోని అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)





కర్నూలు నగరాన్ని సేఫ్ సిటీగా మార్చడానికి జిల్లా పోలీసు శాఖ ఆరు నెలల క్రితం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం వరకు పోలీసులు గస్తీ ఉండే విధంగా చర్యలు చేపట్టి ఇందుకోసం ప్రత్యేకంగా 22 వాహనాలను కూడా సమకూర్చింది. అయినా చోరీలు జరుగుతున్నాయి. నిఘా వ్యవస్థ లోపంతో పాటు గస్తీ నిర్వహణలో అలసత్వం కారణంగా దొంగలు తమ చేతివాటం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దొంగతనాలు, దోపిడీలను నియంత్రించేందుకు పోలీసు నిఘా వ్యవస్థ ఉంది. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఐడీ పార్టీ, నేర విభాగం సిబ్బంది ఉంటున్నారు. వీరి పనితీరు తెలుసుకుని ఉన్నతాధికారికి ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు స్పెషల్ బ్రాంచ్ విభాగం (ఎస్‌బీ) ఉంది. జేబు దొంగల నుంచి రౌడీషీటర్లు, పాత నేరస్తుల వరకు ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలి. రాత్రివేళల్లో శివారు కాలనీలు, వ్యాపార సముదాయాలు, బ్యాంకుల వద్ద సంచరిస్తూ ముమ్మర గస్తీ చేపట్టాలి. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలి. ఇటీవల వరుసగా జరుగుతున్న నేరాలను పరిశీలిస్తే నిఘా పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో మూడేళ్లుగా చోరీల వివరాలు

నేరాలు	2021	2022	2023 (మే వరకు)
దోపిడీలు	21	10	04
పగలు దొంగతనాలు	112	151	96
రాత్రి దొంగతనాలు	207	141	87
సాధారణ దొంగతనాలు	487	286	289
అపహరణకు గురైన సొత్తు (రూ.కోట్లలో)	11.86	12.21	3.34

రవాణాపరంగా అణువుగా ఉండటంతో..

రవాణాపరంగా సౌలభ్యంగా ఉండటంతో ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందినవారు నేరుగా జిల్లాలకు వచ్చి దొంగతనం చేసి పారిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజుల క్రితం కర్నూలు నగరంలో ఐదు అపార్ట్‌మెంట్లలో దొంగలు చొరబడి చోరీలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు అప్రమత్తమై సీసీ ఫుటేజీ, టవర్ డంప్ ఆధారంగా మహారాష్ట్ర దొంగల ముఠా జిల్లాలోకి ప్రవేశించినట్లు నిర్ధారణకు వచ్చారు. వారణాసికి చెందిన ఆనంద్‌కుమార్ గతంలో నగరంలోని పలుచోట్ల అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడగా సీసీ ఫుటేజీ ద్వారా ట్రాకింగ్ చేసి జైలుకు పంపారు. అదే ముఠాకు చెందినవారే తాజాగా అపార్ట్‌మెంట్లలో చోరీకి పాల్పడినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలతో పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

అనుమానాస్పదంగా తిరుగుతూ...

చిత్తు కాగితాలు, పాత వస్తువులు ఏరుకుంటున్నట్లుగా చాలామంది కాలనీల్లో తిరుగుతున్నారు. ఇందులో ఉపాధి కోసం పనిచేసేవారు ఎందరున్నారనే విషయం పక్కనపెడితే ఇలాంటి వాటిని సాకుగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నవారు లేకపోలేదు. గతంలో పాత కల్లూరు, బాలాజీ నగర్ ప్రాంతాల్లో పాత వస్తువులు ఏరుకునే సాకుతో రెండు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు.

పర్యవేక్షణ కొరవడి..

కర్నూలు నగరంలో నిరంతర గస్తీ, విజిబుల్ పోలీసింగ్ కోసం నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో క్యూఆర్టీ వాహనాలతో పాటు బ్లూ కోల్ట్స్ ద్విచక్ర వాహనాలు సైతం అందించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా పెట్టడం, అనుమానితులపై దృష్టి పెట్టడం, గొడవలు జరగకుండా చూడటంతో పాటు ముమ్మరంగా గస్తీ నిర్వహించాలి. అయితే శివారు ప్రాంతాల్లో పోలీసులు గస్తీ తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదో ఒక ప్రాంతంలో వాహనం నిలిపి కాసేపు ఉండి అధికారులు తనిఖీ చేసిన సమయంలో మాత్రం రోడ్డుపైకి వస్తున్నారు. పూర్తిస్థాయిలో గస్తీ కాయడం వలన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు భయపడతారు. కాలనీల్లో దొంగతనాలు ఉండవు. పాత రౌడీలు నేరాలు చేసేందుకు భయపడతారు. దొంగల చిత్రాలను బస్టాండ్, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శనకు పెట్టి ప్రజలను గతంలో అప్రమత్తం చేసేవారు. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

అప్రమత్తతతో క్షేమం..

పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలి. ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే ఆ వివరాలు నమోదు చేసుకుని వారి ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఇంటి యజమానులు లేనప్పుడు దొంగలు తలుపు తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేస్తుండగానే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటి దగ్గర్లో రాత్రి బీట్ నిర్వహిస్తున్నవారిని హుటాహుటిన అక్కడికి పంపిస్తారు. దొంగలు ఆ ఇంటి వద్ద ఉండగానే పట్టుకుంటారు. గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ కాలనీలో గతంలో ఇలా పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ అమలు గురించి ప్రచారం కొరవడటంతో ప్రజలు కూడా పట్టించుకోవడం లేదు. ఎల్‌హెచ్‌ఎంఎస్ గురించి పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

దొంగతనాల నియంత్రణకు స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనుమానితులు కాలనీల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాలు విధిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– కృష్ణకాంత్, ఎస్పీ

చిన్నారులకు అక్షరాభ్యాసం


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొలను భారతీ క్షేత్రంలో ఆదివారం చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. అమ్మవారి సన్నిధిలో వారి చిన్నారులకు భక్తిశ్రద్ధలతో ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసా కార్యక్రమం నిర్వహించారు. అంత ముందు ఆలయ పురోహితులు అమ్మవారికి అభిషేకములు, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచిన భక్తులు కొలనుభారతిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులతో ఏపీ పీఆర్ డిప్లామా అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌస్‌బాషా

కర్నూలు (న్యూటౌన్): ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీ పీఆర్ డిప్లొమా అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌస్‌బాషా ప్రకటించారు. ఆదివారం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం. మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి. నాగ నిరంజన్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫైనాన్స్ సెక్రటరీగా ఎం మద్దిలేటి, వైస్ ప్రెసిడెంట్లుగా వెంకటప్పనాయుడు, కె. వివేక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సి రామచంద్ర, జాయింట్ సెక్రటరీగా పి అమీర్‌బాషా, జాయింట్ సెక్రటరీగా వై రవికుమార్, ఉమెన్ సెక్రటరీగా బి ధరణి, మీడియా సెక్రటరీగా ఆర్ చరణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యు తిరుమలేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యుఎం త్రయంబక్ శాస్త్రిని ఎన్నుకున్నారు.

కుమారుడిని హతమార్చిన తండ్రి


రక్తపు మడుగులో పడి ఉన్న రామకృష్ణ

వెలుగోడు: మద్యానికి బానిసై నిత్యం వేధింపులకు గురిచేస్తున్న కుమారుడిని తండ్రే హతమార్చాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడు ఎస్సీ కాలనీలోని మారెమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న గుండంపల్లి వెంకట నారాయణ, జ్ఞానమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు రామకృష్ణ, మల్లికార్జున, ఒక కూతురు ఉన్నారు. వీరు కూలీ పనులు చేస్తూ పిల్లలను ప్రయోజకులను చేశారు. పెద్ద కుమారుడు రామకృష్ణ (35) కరెంటు పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఆరేళ్ల క్రితం నంద్యాలకు చెందిన శివలక్ష్మితో రామకృష్ణకు వివాహం అయ్యింది. వీరికి ఏడాదిన్నర, ఆరు నెలల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. రామకృష్ణకు మానసిక పరిస్థితిగా సరిగా ఉండకపోవడంతోపాటు మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను దుర్భాషలాడేవాడు. తో తమ్ముడికి కరెంటు షాక్ పెట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అన్నకు భయపడిన తమ్ముడు అత్తగారి ఊరికి వెళ్లి నివాసం ఉంటున్నాడు. కట్టుకున్న భార్యను వేధించే వాడు. భర్త వేధింపులు భరించలేక చిన్న పిల్లలను వెంట పెట్టుకుని భార్య శివలక్ష్మీ నంద్యాలలోని తన పుట్టింటికి వెళ్లింది. అయినా కూడా తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. తల్లిదండ్రులను బాగా ఇబ్బంది పెడుతుండటంతో సహించలేక పలుమార్లు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో విసుగు చెందిన తండ్రి వెంకట నారాయణ..ఆదివారం తెల్లవారుజామున కుమారుడి తలపై రోకలి బండతో దాడి చేయడంతో రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తల్లి జ్ఞానమ్మ స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ జగన్ మోహన్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహానికి ఆత్మకూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక సీ.క్యాంపు రైతుబజారుకు ఈ నెల 27న సెలవు ప్రకటించినట్లుగా ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతు బజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతి నెల ఒక రోజు రైతుబజారును మూసివేసి క్లీనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

తీరనున్న వసతి కష్టాలు

- మంత్రాలయంలో రూ.18 కోట్లతో 180 గదుల నిర్మాణాలు
- వీవీజీలో వంద గదుల రెనోవేషన్
- రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల నాటికి సిద్ధం చేయాలని పీఠాధిపతి ఆదేశం


సీఆర్వో కార్యాలయం వెనుక భాగంలో నిర్మాణం పూర్తికావొస్తున్న 101 గదుల సముదాయం

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి భక్తుల తాకిడి నానాటికీ పెరుగుతోంది. దీంతో వచ్చిన వారికి పూర్తిస్థాయిలో వసతి కల్పించాలని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సంకల్పించారు. ఇందులో భాగంగా వసతి గదుల నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. మఠం ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు వసతి గృహాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం 1200 వరకు వసతి గదులు ఉన్నాయి. అయినా కొన్ని సందర్భాల్లో అవి చాలకపోతుండటంతో భక్తులు ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయిస్తుండటంతో వాటి నిర్వాహకులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో భక్తుల భాగస్వామ్యంతో కొత్తగా వసతి గదుల సముదాయాల నిర్మాణాలు చేపట్టారు. ఆగస్టులో జరగబోయే రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల నాటికి 180 కొత్త గదులు, పాత వంద గదులను అందుబాటులోకి తీసుకురావాలని పీఠాధిపతి అధికారులను ఆదేశించారు. ఆ దిశగా నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.

చేపట్టిన నిర్మాణాలు ఇవే..

- సీఆర్వో కార్యాలయం వెనక రూ.8 కోట్లతో మొత్తం 101 వసతి గదుల నిర్మాణానికి మూడేళ్ల క్రితం బెంగళూరుకి చెందిన భక్తుడు నిర్మాణాలు ప్రారంభించారు. అయితే రెండేళ్ల పాటు కరోనా రావడంతో లాక్‌డౌన్ వల్ల పనులకు ఆటంకం కలిగింది. దీంతో పనులు నెమ్మదించాయి. ప్రస్తుతం పనులు వేగం పుంజుకున్నాయి. సముదాయం నిర్మాణం పూర్తికాగా రంగులు వేస్తున్నారు. ప్రహరీ నిర్మాణం, మొక్కల పెంపకం, విద్యుత్, ఏసీలు అమరికలు తదితర పనులు కొనసాగుతున్నాయి. వీటన్నింటినీ ఆరాధనోత్సవాల్లోపు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నారు. ఇందులో ఆరు ఏసీ గదులు ఉన్నాయి.
- దుర్గామణ కల్యాణ మండపం ఎదుట రూ.8 కోట్లతో భక్తుల భాగస్వామ్యంతో 80 గదుల సముదాయ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ప్లాస్టింగ్, గదుల్లో బండపరుపు, విద్యుగ్ పనులు జరుగుతున్నాయి. ఇందులో మొత్తం 34 ఏసీ గదులను ఏర్పాటు చేయనున్నారు. ఎనిమిది నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఈ సముదాయాన్ని కూడా ఆరాధనోత్సవాలలోపు పూర్తి చేయనున్నారు.
- వీవీజీ వంద గదుల సముదాయం పాతబడిపోయింది. దీన్ని నిర్మించి 30 సంవత్సరాలు కావస్తుండటంతో గదుల్లో పెచ్చులూడటం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వాటికి మరమ్మతు పనులు రూ.2.50 కోట్లతో కొనసాగుతున్నాయి. వీటిని ఆరాధనోత్సవాలలోపు అందుబాటులోకి తేవడానికి శ్రమిస్తున్నారు.

సాయం చేసి.. కేసులో చిక్కుకుని

- ఆపద అంటూ ముగ్గురు యువకులను నమ్మించిన అపరిచితుడు
- రూ. 95 వేలు ఫోన్‌పే చేసి నగదు ఇప్పించుకున్న వ్యక్తి
- అకౌంట్‌లో డబ్బులు గల్లంతని హైదరాబాద్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు

ప్యాపిలి: అపరిచితులతో నగదు లావాదేవీలు చిక్కులు పడేస్తాయనేందుకు నిదర్శనమే ఈ ఘటన. మానవత్వంతో ఇబ్బందులు ఉన్న వ్యక్తికి చిన్న సాయం చేసిన ముగ్గురు యువకులపైనే చివరకు కేసు నమోదైంది. ఈ నెల 15వ తేదీ ప్యాపిలి పట్టణ సమీపంలోని అరుణాచల ట్రాన్స్‌పోర్టు వద్ద వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సాయిచరణ్, హేమంత్, ప్రసాద్ పెట్రోల్ కోసం వచ్చి వేచి ఉన్నారు. ఇంతలో వారి వద్దకు కర్నూలు వైపు వెళ్లే కారు వచ్చి ఆగింది. అందులో నుంచి ఓ యువకుడు దిగి ఆసుపత్రికి వెళ్తున్నానని, ఆసుపత్రి ఖర్చులకు లక్ష రూపాయలు నగదు కావాల్సి ఉందన్నాడు. తనకు నగదు ఇస్తే ఈ మొత్తాన్ని ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. మానవతా దృక్పథంతో స్పందించిన సాయిచరణ్ రూ.45,000, హేమంత్ రూ. 25,000, ప్రసాద్ రూ.25,000 చొప్పున ఆ యువకుడికి నగదు చెల్లించారు. ఆ తర్వాత ఆ వ్యక్తి వారికి ఫోన్‌పే చేసి వెళ్లిపోయాడు. అంతవరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. ఏమి జరిగిందో తెలియదు కానీ.. నగదు తీసుకుని ఫోన్‌పే చేసిన ఆ యువకుడు హైదరాబాదులోని హయాత్‌నగర్‌లో సైబర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. తన ఖాతా నుంచి సాయిచరణ్, హేమంత్, ప్రసాద్ అనే వ్యక్తుల ఖాతాకు రూ. 95 వేలు బదిలీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో స్పందించిన సైబర్ పోలీసులు ఈ ముగ్గురి ఖాతాలను హోల్డ్‌లో ఉంచేవిధంగా చర్యలు తీసుకున్నారు. అదే రోజు సాయిచరణ్ తన ఫోన్‌పే నుంచి ధనుజంయ అనే వ్యక్తికి రూ. 45,000 ఫోన్ పే చేశాడు. దీంతో సైబర్ పోలీసులు ఈ వ్యవహారంతో సంబంధం లేని ధనుంజయ ఖాతాను కూడా హోల్డ్‌లో ఉంచారు. అంతే కాకుండా విచారణ నిమిత్తం సైబర్ పోలీసులు హైదరాబాదుకు రావాల్సిందిగా ఫోన్ చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

మరోసారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్


సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

కర్నూలు సిటీ: మార్కులలో వ్యత్యాసాలు ఉండడంతో కేజీబీవీల్లో (కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో) పోస్టుల భర్తీకి మరోసారి ఆదివారం సమగ్ర శిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్(స్పెషల్ ఆఫీసర్), సీఆర్‌టీ, పీజీటీ..మొత్తం 233 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో మెరిట్ ప్రాతిపదికన ఒక పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేశారు. వెరిఫికేషన్‌కు 634 మందిని ఆహ్వానించగా 589 మంది హాజరయ్యారు. అయితే వీరి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలలోని మార్కులు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు సయమంలో నమోదు చేసిన మార్కులకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో మరోసారి ఒక పోస్టుకు ఐదుగురు అభ్యర్థులతో మరో మెరిట్ జాబితా తయారు చేసి 963 మందిని వెరిఫికేషన్‌కు ఆహ్వానించారు. రెండు రోజుల పాటు జరగనున్న వెరిఫికేషన్‌కు ఏ రోజు ఎంత మంది రావాలి అనే విషయం అభ్యర్థులకు తెలిపినా అధిక శాతం మంది ఆదివారమే వచ్చారు. దీంతో సమగ్ర శిక్ష కార్యాలయం కిక్కిరిసి పోయింది. మెరిట్ జాబితాలోని వారిని ఒక్కోసారి 50 మంది చొప్పున సమగ్ర శిక్ష హాల్‌లోకి పంపించి వెరిఫికేషన్ చేశారు. మొదటి రోజున 346 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత ఒక పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేసి, వారికి ఈ నెల 28 నుంచి స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు.